


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
మంగళవారం 26 మార్చి 2024





రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం 6:24(సాయంత్రం)
సెహరీ : బుధవారం 4:55 (ఉదయం)





ఆత్మకూరు పట్టణం ఏరియల్ వ్యూ

- డాంబికాలు పలికి తుస్సుమన్న నాయకులు
- మొన్నటి దాకా శిల్పాపై తీవ్ర విమర్శలు
- ఓడించి తీరుతామని ప్రగల్బాలు
- తిరిగి ఆయన పంచనే చేరిన వైనం
- ఆ ముగ్గురి తీరుపై నవ్వుకుంటున్న జనం
- ప్రలోభాలే కారణమని వైసీపీ నాయకుల్లోనే చర్చ..!

ఉత్తుత్తి అలకలే...!

ఆత్మకూరు, మార్చి 25: శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరులో కొందరు వైసీపీ నాయకుల అలకలు చివరికి వారినే అభాసుపాలు చేశాయన్న విమర్శలు ఉన్నాయి. పార్టీలో తమకు జరిగిన అవమానాలు, వివక్షలతో రగిలిపోయిన ఆ నాయకులు కొంత కాలంగా ఆ పార్టీకి దూరం ఉంటూ వచ్చారు. ఆ తర్వాత తాము పార్టీని వీడటమే కాకుండా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని ఓడించి తీరుతామని డాంబికాలు పలికారు. రాజకీయాల గురించి ఎక్కడ చర్చ జరిగినా వారు ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తూ వచ్చారు. కట్ చేస్తే.. ఎన్నికలు దగ్గరికి వచ్చేలోగా ఎవరినైతే ఓడగొడతామని ప్రగల్బాలు పలికారో ఇప్పుడు ఆ నాయకులు మెత్తబడి, అతని పక్షానే నిలబడ్డారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన ఆ ముగ్గురు ఏమీ తెలియదన్నట్లుగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ నాయకుల తిరుగు టపాపై ఇక్కడి జనం నవ్వుకుంటున్నారు. వారి తీరుపై అనుచరులు అసంతృప్తితో ఉన్నారు. మొత్తానికి వీరి వ్యవహారం రాబోయే ఎన్నికల్లో అధికార వైసీపీకి మేలు కంటే నష్టమే ఎక్కువ చేస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎమ్మెల్యే శిల్పాను ఓడించి తీరుతామని చెప్పి..?

ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన (స్థానికంగా అందుబాటులో లేని) నాయకుడు వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఈ క్రమంలోనే ఈ నాయకుడి సతీమణికి ఆత్మకూరు మండలంలో మూడేళ్ల క్రితం ఓ కీలక పదవి కట్టబట్టేందుకు ఎమ్మెల్యే శిల్పా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే సదరు నాయకుడు ఎమ్మెల్యే శిల్పా అంటే ఏమాత్రం గౌరవం లేకుండా తొలి నుంచి తాను పార్టీలో ఉన్నానని, తనకు సీఎం జగన్‌తోనే సన్నిహితం ఉందని చెప్పుకొచ్చేవాడని ప్రచారం జరిగింది. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా పడి చివరికి ఎమ్మెల్యే శిల్పాకు చేరడంతో ఇస్తానన్న పదవిని కాస్త ఆయన భార్యకు ఇవ్వకుండా మరొకరికి అవకాశం కల్పించారు. అలాగే ఆయన్ని తన కార్యక్రమాలకు కూడా ఆహ్వానించకుండా దూరంగా ఉంచారు. దీంతో రగిలిపోయిన సదరు నాయకుడు అప్పట్లో కన్నీటిపర్యంతమై ఎమ్మెల్యే శిల్పాపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అడిగిన డబ్బు ఇవ్వకపోవడం వల్లే తమకు పదవి ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే శిల్పా, వైసీపీ కార్యక్రమాలకు చాలా రోజుల పాటు దూరంగా ఉంటూ వచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా ఓడించి తీరుతామని, నియోజకవర్గాన్ని విడిచేలా చేస్తామని తన అనుచరులు, ఇతర నాయకులతో పదేపదే అక్కసు వెలిబుచ్చారు. ఒకానొక సమయంలో ఇతను టీడీపీలోకి వస్తారనే ప్రచారం కూడా జరిగింది. అయితే అసలు ఏం జరిగిందో ఏమో గానీ రాప్తాడు సిద్ధం సభకు ముందు ఆ నాయకుడు తిరిగి శిల్పా పక్షాన చేరారు. అదే రోజు ఇద్దరు కలిసి ప్రెస్‌మీట్ పెట్టినా ఇద్దరి ముఖాల్లో చిన్నపాటి నవ్వు కూడా కూడా లేకుండా ఏదో తెలియని భంగపాటు కనిపించింది. వీరిని చూసిన జనం ఒక్కసారిగా అవాక్కయ్యారు.

వైసీపీ అధిష్టానానికి ఎమ్మెల్యే శిల్పాపైనే ఫిర్యాదు చేసి..?

ఆత్మకూరు మున్సిపాలిటీలోని ఓ కీలక నేత కొంతకాలంగా ఎమ్మెల్యే శిల్పాను విభేదించాడు. తన అనుచరగణంతో ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకొని రాజకీయం సాగించాడు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి మున్సిపాలిటీలో కీలకంగా ఉన్న తమను కాదని ఇతరులకు పెత్తనం ఇవ్వడాన్ని సహించలేకపోయాడు. తొలుత పార్టీలో తమకు అడ్డంకిగా ఉన్న ఓ నాయకుడి పదవిని తొలగించాలని పట్టుబట్టి పంతం నెగ్గించుకున్నాడు. ఆ తర్వాత కూడా తనకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతరులకు పెత్తనం కట్టబెట్టడంతో రగిలిపోయాడు. దీంతో పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉండిపోయాడు. ఆ తర్వాత ఎమ్మెల్యే శిల్పాను వ్యతిరేకించే నాయకులతో ఆయన కోటరీని తయారు చేసుకొని ఎమ్మెల్యే శిల్పాపైనే అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అంతేకాదు తన అనుచరగణంతో విహార యాత్రలే కాకుండా తన వారిని ఎమ్మెల్యే శిల్పా వర్గీయులు ప్రలోభాలకు గురి చేసేందుకు వీలే లేకుండా ఉండేలా వారిని ఇతర ప్రాంతాలో కొద్ది రోజులపాటు మకాం వేయించినట్లు తెలిసింది. ఒకానొక సందర్భంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డిని ప్రకటిస్తే ఆయన సమక్షంలో పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఏకంగా చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి వస్తారనేది పట్టణంలో తీవ్ర చర్చ జరిగింది. దీంతో ఈ నాయకుడు పార్టీని వీడతారని గమనించిన ఎమ్మెల్యే శిల్పా ఆయన వార్డులో ప్రత్యామ్నాయ నాయకులను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇంతగా ఎమ్మెల్యే శిల్పాపై తిరుగుబావుటా ఎగరేసి తిరిగి శిల్పాతో చేతులు కలపడం చర్చనీయాంశంగా మారింది. ఆయన తీరుపై సొంత వార్డులోనే తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఇంతకాలం ఆయన మాటలు నమ్మిన అనుచరులు ఇప్పుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము ఎప్పుడో టీడీపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉంటే అందరం కలిసి వెళ్తామని తమను ఆపి తాను తిరిగి వైసీపీలోనే కొనసాగడాన్ని తప్పుబడుతున్నారు. ఈయన రాకతో వైసీపీలో మళ్లీ వర్గ విభేదాలు కొనసాగే అవకాశం ఉంది. చివరికి ఆయన సొంత అనుచరులే రాజకీయాలకు పనికిరాడంటూ చర్చించుకోవడం గమనార్హం.

ఆ ముగ్గురు నాయకులతో వైసీపీకి నష్టమేనా..?

ఆత్మకూరు ప్రాంతంలో అలకబూని అభాసుపాలైన ఆ ముగ్గురు నాయకులతో వైసీపీకి నష్టం జరిగే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. దీన్నిబట్టి ఎమ్మెల్యే శిల్పాను విమర్శించిన వారికే తిరిగి పార్టీలోకి తీసుకుంటే పార్టీ శ్రేణులకు ఎలాంటి సంకేతం ఇచ్చినట్లు అవుతుందని అంటున్నారు. అదేవిధంగా ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ఆ నాయకులతో ఎమ్మెల్యే శిల్పా సన్నిహితంగా ఉండే అవకాశం ఉంటుందా..? అన్నది కూడా ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. శ్రీశైల నియోజకవర్గంలో వైసీపీ గ్రాఫ్ పడిపోతుండటం వల్లే ఎమ్మెల్యే శిల్పా వారిని బుజ్జగించినట్లు తెలిసింది. అయితే భారీగా ముడుపులు, ప్రలోభాలకు లొంగడం వల్లా వీరు తిరిగి పార్టీలోకి కొనసాగుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఎమ్మెల్యే శిల్పాకు నేనేంటో చూపిస్తా..?

ఆత్మకూరు పట్టణానికి చెందిన ఓ నాయకుడు స్టేట్ కార్పొరేషన్‌లో ఓ పదవిలో కొనసాగుతున్నాడు. అలాగే పార్టీకి సంబంధించి కీలకమైన బాధ్యతలను కూడా చేపట్టారు. నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే శిల్పా గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారు. ఆ తర్వాత కూడా ప్రతిపక్ష నాయకులపై అత్యుత్సాహంతో దూషణలు కూడా చేశారు. ఈయన ఓవర్ యాక్షన్‌ను తట్టుకోలేని అదే పార్టీకి చెందిన నాయకులే ఆయన్ని వ్యతిరేకించారు. ఇదే క్రమంలోనే ఆయనపై భూకబ్జా ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. పార్టీ పదవితో ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా పెత్తనం చేయడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆయన్ని వ్యతిరేకించారు. పార్టీ పదవి నుంచి తప్పించాలని, లేకపోతే తామే పార్టీని వీడి వెళ్తామని ఎమ్మెల్యే శిల్పాకు ముఖ్య నాయకులంతా మూకుమ్మడిగా అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో సదరు నాయకుడికి ఉన్న పార్టీ బాధ్యతలను తప్పించి మరొకరికి అప్పగించారు. ఈ వ్యవహారంలో తనను పార్టీ బాధ్యతల నుంచి తప్పి అవమానపర్చడంతో సదరు నాయకుడు రగిలిపోయాడు. పార్టీ కార్యక్రమాలను కొంతకాలంపాటు దూరంగా ఉన్నారు. టీడీపీలోకి వెళ్లేందుకు ముఖం లేకపోవడంతో జనసేనపార్టీలోకి వెళ్తానని ప్రచారం చేసుకున్నాడు. వచ్చే ఎన్నికల్లో తానేంటో ఎమ్మెల్యే శిల్పాకు చూపిస్తానని ఇతరులతో చెప్పేవారు. చివరికి ఎన్నికలు దగ్గరికి వచ్చేలోగా ఎమ్మెల్యే శిల్పా చెంతకు చేరడంతో ఆయన చెప్పిన మాటలు విన్న జనం అవాక్కయ్యారు. ఇదిలావుంటే ఈయనతో వైసీపీలో చాలా మందికి విభేదాలు ఉన్నాయి. ఈయన తిరిగి పార్టీలో కొనసాగితే వైసీపీలోని ముఖ్య నాయకులు సైతం ఆ పార్టీకి దూరమయ్యే అవకాశం ఉన్నట్లు ఆ పార్టీ నాయకులే చర్చించుకోవడం గమనార్హం.

సాయుధ బలగాల హోలీ

నంద్యాల క్రైం, మార్చి 25 : హోలీ పండుగను సోమవారం కేంద్ర సాయుధ బలగాల అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వారు ఉండేందుకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. హోలీ వేడుకల్లో ఎస్పీతో పాటు కేంద్ర బలగాల కమాండెంట్ బాన్‌లాల్‌శ్యామ్, డిప్యూటీ కమాండెంట్ నీరజ్‌కుమార్, అసిస్టెంట్ కమాండర్ అజయ్‌కుమార్, నంద్యాల టౌన్ డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐలు నరసింహులు, చలపతి, రాజారెడ్డి, దస్తగిరిబాబు, ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్ర సాయుధ బలగాల అధికారి నుదుట తిలకం దిద్దుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

జ్వాలా నృసింహునికి చక్రస్నానం



ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామికి తీర్థవారి చక్రస్నానం చేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ, మార్చి 25: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎగువ అహోబిలంలో పదకొండో రోజు సోమవారం జ్వాలా నరసింహస్వామికి అవభృత, తీర్థవారి చక్రస్నానం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. ముందుగా జ్వాలా నరసింహస్వామికి ఉత్సవం, ద్వాదశారాధన పుష్పయాగం, గరుడోత్సవం, ధ్వజారోహణం నిర్వహించారు.

దిగువ అహోబిలంలో. . .

బ్రహ్మోత్సవాలలో భాగంగా దిగువ అహోబిలంలో సోమవారం ప్రహ్లాద వరదస్వామికి, ఉభయ దేవేరులకు అశేష భక్తజనాల మధ్య రథోత్సవం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ జలవనరుల సలహాదారుడు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు దిగువ అహోబిలంలో..

దిగువ అహోబిలంలో మంగళవారం ఉత్సవం, తీర్థవారి చక్రస్నానం, ద్వాదశారాధన పుష్పయాగం, గరుడోత్సవం, ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయి.



పెరిగిన ఉపాధి కూలి

- ఏప్రిల్ 1 నుంచి అమలు
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో వేసవి భత్యానికి ఎసరు



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 25: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు దినసరి కూలి పెంచాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు జాబ్‌కార్డులు కలిగి ఉన్న ఐదున్నర లక్షల మంది కూలీల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు అంటున్నారు. అయితే ఎంత పెరిగేదీ ఇంకా స్పష్టత ఇంకా రాలేదు. కేంద్ర ప్రభుత్వం 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. అప్పుడు దినసరి కూలీ రూ.87.50 ఉండగా.. ప్రస్తుతం రూ.272 చెల్లిస్తున్నారు. వేసవిలోని మార్చి, ఏప్రిల్, మే మూడు నెలల పాటు ఉపాధి పనులు చేసేందుకు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలు ఉదయం, సాయంత్రం, రెండు పూటలా పనులు చేసుకోవడానికి అవకాశం ఉంది.

● వేసవి భత్యానికి ఎసరు: గతంలో ఉపాధి కూలీలకు వేసవి భత్యం ఇచ్చేవారు. మార్చి నుంచి జూన్ వరకు 15 నుంచి 30 శాతం వేసవి భత్యాన్ని కూలీలు పొందేవారు. ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం భత్యం దక్కేది. ఏపీ ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేసినప్పుడు వేసవి భత్యాన్ని క్రమం తప్పకుండా కూలీలకు అందించేవారు. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమలులోకి తెచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన వివరాలు పొందుపరచకపోవడం వల్ల ఉపాధి పనులు చేస్తున్న కూలీల నోట్లో మట్టి పడింది. 2022లో రూ.12, 2023లో రూ.15 కూలీని పెంచుకుంటూ వచ్చారు. ఈ ఏడాది ఎంత పెంచుతారో స్పష్టం చేస్తూ ఇంకా ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం పనులు చేసే ప్రదేశాల్లో ఎండవేడిమి తట్టుకోలేక కూలీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. నీడ కోసం డేరాలు ఏర్పాటు చేయడంతో పాటు నీటి వసతి కూడా మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కల్పించింది. టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని కూలీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మొర పెట్టుకుంటున్నారు.

వచ్చే నెల నుంచి వర్తింపు

గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం దినసరి కూలిని ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. ఎంత మొత్తం పెంచేదీ స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా వివరాలు వెల్లడించలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే కూలీలకు అదనపు కూలి చెల్లిస్తాము. కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తే పని చేసే చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం.
- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

పరాకాష్టకు చేరిన ప్రచార పిచ్చి

- మల్లన్న సన్నిధిలోనే జగన్ పాటకు స్టెప్పులు
- మండిపడుతున్న మల్లన్న భక్తులు



మహిళతో కలిసి స్టెప్పులు వేస్తున్న వైసీపీ కార్యకర్త అవులపాటి హిమకాంత్

శ్రీశైలం, మార్చి 25: వైసీపీ అనుచరుల ప్రచారం పిచ్చి పరాకాష్టకు చేరింది. ఓ కార్యకర్త ఏకంగా శివనామస్మరణ చేయాల్సిన మల్లన్న సన్నిధిలోనే జగన్ పాటకు సెప్పులు వేయడం చర్చనీయాంశమైంది. దేవదాయ చట్టం ప్రకారం శ్రీశైల మహా క్షేత్రంలో ఎటువంటి రాజకీయ ప్రచారాలు, కార్యక్రమాలు జరపకూడదు. అయితే స్థానిక వైసీపీ కార్యకర్త అవులపాటి హిమకాంత్ ఓ మహిళతో కలిసి జగన్ పార్టీకి సంబంధించిన పాటకు ఆదివారం రాత్రి స్టెప్పులు వేశాడు. దేవస్థానం విరాళాల కేంద్రం పక్కన రోడ్డుపైనే ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. సెల్‌ఫోన్‌లో జగన్ పాట పెట్ట బ్లూటూత్ కనెక్షన్ ఇచ్చాడు. దానికి స్పీకర్లు పెట్టి రోడ్డుపైనే ఓ మహిళతో స్టెప్పులు వేశాడు. ఇది చూసిన భక్తులు విస్మయానికి గురయ్యారు. అనంతరం తన ఫేస్‌బుక్‌లో వీడియోను అప్‌లోడ్ చేసుకోవడంతో వైరల్ అయింది. ఆ తరువాత ఆ పార్టీ నాయకులు ఆ వీడియోను తీసివేయించినట్లు తెలుస్తోంది.





వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు





ఎన్నికల ప్రచారంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీశైలం మండలంలో జరిగిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. సుండిపెంట ఎస్టీ కాలేజీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి జరీనా, తెలంగాణ జెన్కో పవర్ ప్లాంట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఇలచల యోగయ్య, శ్రీశైల దేవస్థానంలో కార్తికేయ, ఏజెన్సీలో సెక్యూరిటీ గార్డు బాబు, సుండిపెంట స్కూల్స్ కమిటీ ఛైర్మన్‌లతోపాటు శ్రీశైలంలో పని చేస్తున్న వలంటీర్లు చాంద్‌బాషా, రత్నకుమార్ ప్రచారంలో పాల్గొన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు వ్యవహారాలపై శ్రీశైలం మండల టీడీపీ ఇన్‌చార్జి వెన్న శ్రీధర్‌రెడ్డి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల అధికారులు ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




చీరెలు కట్టిన మగవారు

- హోలీ వేడుకలో ఆచారం
- కోరికలు తీరాలంటే కొంగు కట్టాల్సిందే
- సంతెకుడ్లూరు సాంప్రదాయం

ఆదోని రూరల్/ఆదోని మార్చి 25 : హోలీ రంగుల పండుగ ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో విభిన్నంగా జరుగుతుంది. ఈ వేడుకలో కోరికలు తీరాలంటే మగవారు చీరెలు కట్టి గ్రామంలో వెలసిన రతీమన్మథులను పూజిస్తారు. సోమవారం హోలీ సందర్భంగా గ్రామంలో పలువురు మగవారు ఇట్లా స్త్రీ వేషధారణలో రతీ మన్మథులను పూజించారు. రెండురోజులపాటు గ్రామంలో రతీ మన్మథుల రథోత్సవం, కామదహనం మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామంలో పేద రైతు అయినా, భూస్వామి అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా చీరె కట్టి, గాజులు వేసుకొని, నుదుటిన బొట్టు పెట్టుకొని, సిగలో పూలు, మెడలో నగలు ధరించి రతీమన్మథులను పూజిస్తారు. బైటి వాళ్లకు ఇది వింత ఆచారం అనిపించినా స్థానికులకు మాత్రం పవిత్ర కార్యం. కొన్ని దశాబ్దాలుగా గ్రామమంతా కుల మతాలకతీతంగా ఈ ఆచారం కొనసాగిస్తున్నారు. గ్రామం సంతోషంగా ఉండాలన్నా, కుటుంబం కష్టాల నుంచి గట్టెక్కాలన్నా, పంటలు బాగా పండాలన్నా, ప్రభుత్వ ఉద్యోగం రావాలన్నా, మగ పిల్లలు జన్మించాలన్నా మగవారు ఇట్లా రతీ మన్మథులను పూజించడం ఇక్కడి ఆచారం.









ప్రభుత్వ ఉద్యోగం రావాలని

నేను అమరావతిలో బి.టెక్ చదువుతున్నా... 15 సంవత్సరాలుగా చీర ధరించి ప్రతి ఏడాది స్వామిని దర్శించుకుంటున్నాను. నాతోపాటు నా కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని, నాకు ప్రభుత్వ ఉద్యోగం రావాలని దేవున్ని కోరుకున్నా. **-మంజునాథ, బీటెక్ విద్యార్థి, సంతెకుడ్లూరు**

ఆరోగ్యం కుదుటపడిందని..

నాకు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు అనారోగ్యానికి గురయ్యాను. మా అమ్మ గాయత్రి, నాన్న నాగరాజు ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు బతకడన్నారు. నా కొడుకు ఆరోగ్యం బాగు చేయాలని మా అమ్మ, నాన్న రతీ మన్మథులను వేడుకున్నారు. అప్పుడు నా ఆరోగ్యం కుదుట పడింది. 17సంవత్సరాలుగా ప్రతి ఏడాది చీర కట్టుకొని స్వామిని దర్శించుకుంటున్నాను.

-అశోక్, సంతెకుడ్లూరు

మూర్ఛ వ్యాధి నయమైంది

నా వయస్సు 48 సంవత్సరాలు. 43 ఏళ్లుగా చీర కట్టి స్వామిని దర్శించుకుంటున్నాను. నాకు ఐదేళ్ల ఉన్నప్పుడు మూర్ఛవ్యాధి వచ్చింది. అప్పుడు మా అమ్మ రామమ్మ రతీమన్మథులను మొక్కుకొంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది హోలీ రోజున చీర కట్టి పూజిస్తున్నాన ఇప్పటి వరకు నాకు మళ్లీ మూర్ఛ వ్యాధి రాలేదు.

కేశవరెడ్డి, రైతు, సంతెకుడ్లూరు

నీట్‌లో ర్యాంకు రావాలని

ఇంటర్ సెకండియర్ పూర్తయింది. ఎంసెట్, నీట్ ఎగ్జామ్ సన్నద్ధమవుతున్నా. నీట్‌లో ర్యాంకు రావాలని రతీ మన్మథులను కోరుకున్నాను. ఉద్యోగం కూడ రావాలని స్వామిని మగువ రూపంలో పంజాబీ డ్రస్సు ధరించి పూజించాను.

-ప్రశాంత్, విద్యార్థి, సంతెకుడ్లూరు

కొడుకు పుడితే చీరె కట్టిస్తానని మొక్కుకున్నా

రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి ఆంజనేయులుతో నాకు వివాహమైంది. మాకు మొదటి సంతానం కొడుకు జన్మిస్తే మా అబ్బాయి స్త్రీ వేషధారణలో దర్శించుకుంటాడని రతీమన్మథులకు మొక్కుకున్నా. మొదటి సంతానం నిఖిల్ ప్రతాప్ రాణా. ఈ రోజు స్వామిని మగువ రూపంలో నా కొడుకు మొక్కుబడి తీర్చుకున్నాడు.

-శాంతి, ఆర్మీ ఉద్యోగి భార్య, సంతెకుడ్లూరు



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీతో గ్రామ వలంటీర్లు

ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా

రుద్రవరం, మార్చి 25 : రుద్రవరం గ్రామానికి చెందిన రాజు, వెంకటేశ్వర్లు అనే వలంటీర్లు ఆదివారం సాయంత్రం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ వలంటీర్లను రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ చెబుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



ఆళ్లగడ్డ ఎమ్మెల్యేతో గ్రామ వలంటీరు రాజు

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

కోడుమూరు (రూరల్), మార్చి 25: వెల్దుర్తి-లద్దగిరి గ్రామాల మధ్య ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. కోడుమూరుకు చెందిన గుంటెప్ప, ఆదిలక్ష్మి దంపతులు వారపుసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఆదివారం సొంత ఆటోలో కూరగాయలు తీసుకుని వెల్దుర్తి సంతకి వెళ్లారు. అక్కడ కూరగాయలు విక్రయించి రాత్రి మిగిలిన కూరగాయలను ఆటోలో వేసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ సమీపాన రోడ్డుపై కుక్క అడ్డు రాగా దాన్ని తప్పించబోగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో మీద పడడంతో గుంటెప్ప తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆదిలక్ష్మికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ప్రయాణికులు వారిని 108 వాహనంలో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే గుంటెప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె సంతానం. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల దొంగలు అరెస్టు

బనగానపల్లె, మార్చి 25: బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామ సమీపంలోని పలుకూరు ఆర్చీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు దొంగలను గొర్రెల గుర్తించి అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ తిరుపాలు సోమవారం తెలిపారు. తాము పలుకూరు ఆర్చీ వద్ద ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లాకు చెందిన ఎరుకలి నారాయణస్వామి, ఎరుకలి నరేంద్ర, దాసరి లోకేశ్ కారులో నాటుసారా సరఫరా చేస్తుండగా కారుతో సహా నాటుసారాను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసినట్లు తెలిపారు. నందివర్గం, శిరివెళ్ల మండలాల్లో గొర్రెలను దొంగిలించి బనగానపల్లె మండలంలోని రామకృష్ణాపురం కొండల్లో దాచి ఉంచినట్లు వారు నేరం ఒప్పుకున్నారని, వారిని అరెస్టు చేసి గొర్రెలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

వరదలా టీడీపీలోకి వలసలు

- పార్టీలో పెరిగిన జోష్
- డీలా పడుతున్న వైసీపీ శ్రేణులు
- ఒక్కరోజే 85 వైసీపీ కుటుంబాలు చేరిక

బనగానపల్లె, మార్చి 25: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి రోజు రోజుకూ వలసలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జాతర వాతావరణం నెలకొంది. టీడీపీ కార్యకర్తల్లో జోష్ రెట్టింపైంది. సోమవారం ఒక్కరోజే 85 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో మండలంలోని పతేనగర్ గ్రామానికి చెందిన అక్కన్నగారి గంగన్నకుమారుడు రమేశ్, ఎల్లాకృష్ణ, చెన్నారెడ్డి, గుండుమద్దయ్య, గోపాల్, పర్లపాటిశివుడు, భాస్కరయ్య, రాజు, నారాయణ తదితర 16 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే బనగానపల్లె పట్టణంలోని కొండపేటకు చెందిన 14 కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అలాగే బనగానపల్లె పట్టణంలోని కరెంట్ ఆఫీసు ఏరియాకు చెందిన చెందిన 45 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారంతా కష్టపడి పనిచేయాలన్నారు.



కరెంట్ ఆఫీస్ ఏరియాకు చెందిన 45 వైసీపీ కుటుంబాల వాళ్లకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

జూపాడుబంగ్లా, మార్చి 25: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో సోమవారం నాగరత్నం అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు రాళ్లతో దాడిచేశారు. ఈ మేరకు ని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జాతీయ రహదారి కిందికి గ్రామంలోని శ్మశానవాటిక పోవడంతో నాగరత్నం అనుభవంలో ఉన్న డీపట్టా పొలంలో శ్మాశనం ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని ఖననం చేయడానికి తీసుకొని వెళుతుండగా నాగరత్నం అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన తిరుపాలు, వినోద్, సాయి, నవీన్ తదితరులు రాళ్లతో కొట్టడంతో నాగరత్నం తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిప్పగిరి, మార్చి 25 : ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేయడానికి నిల్వ ఉంచిన రూ.12 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని చిప్పగిరి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామం వైసీపీ నాయకుడు విక్రాంత్ రెడ్డి క్వారీకి దగ్గరలో ఉన్న కొండలో 124 బాక్సుల కర్ణాటక మద్యాన్ని నిల్వ ఉంచినట్లు ఎస్పీ శ్రీకాంత్‌కు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు చేసి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకొని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మహమ్మద్ రిజ్వాన్, పోలీసులు నజీర్ అహ్మద్, ఖాదర్ బాషా, సాగర్, యశ్వంత్, భాస్కర్, శంకర్, ఎన్నికల ప్రత్యేకాధికారులు ప్రకాష్, అంజనేయులు పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

- వైసీపీ ఇంటికి పోయేది ఖాయం
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 25: ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న వ్యక్తి రాగద్వేషాలకు అతీతంగా పాలన సాగించాల్సింది పోయి దౌర్జన్యాలు, పోలీసుల కేసులంటూ ప్రతి ఒక్కరిని టార్గెట్ చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని సీఎం జగన్‌ను ఉద్దేశించి టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరులోని నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో జరిగిన వైసీపీ పాలన పట్ల ప్రజలు ఎంతో అసంతృప్తితో ఉన్నారన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కలుస్తున్నామని, ఏ ఒక్క వర్గం ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై సంతృప్తిగా లేరని అన్నారు. 2024 ఎన్నికల్లో 10 స్థానాల్లోపే వైసీపీ పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు. ప్రజల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నదని అన్నారు. వలంటీర్లతో వెట్టి చాకిరీ చేయించుకున్న జగన్‌పై వెట్టిచాకిరీ చట్టం కింద కేసులు నమోదు అవుతాయన్నారు. ఇసుక దందా చేసిన వారు రాశుల కొద్ది డబ్బులు సంపాదించారని, ఇసుక సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేశారని అన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నంద్యాల పార్లమెంట్‌కు ఈ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిని కడప నుంచి దిగుమతి చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో చెరకుచర్ల రఘురామయ్య, కట్టుబడి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

ఆస్తుల వివరాలు బయటపెట్టే ధైర్యముందా..?

- మంత్రి బుగ్గనకు కోట్ల సవాల్
- ఆర్థిక క్రిమినల్ ప్రమాదకరమంటూ వ్యాఖ్య

డోన్, మార్చి 25: ఐదేళ్ల కాలంలో తన ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా సంపాదించిన ఆస్తుల వివరాలను బైట పెట్టే ధైర్యం బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఉందా? అని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో కోట్లను నంద్యాల పార్లమెంటు ఐటీడీపీ నాయకులు నరేష్ బాబు, బాబా ఫక్రుద్దీన్, షంషుద్దీన్ కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక మంత్రి పదవిని బుగ్గన కేవలం తన ఆస్తులను పెంచుకోవడానికే ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. బుగ్గన లాంటి ఆర్థిక క్రిమినల్‌తో ప్రజలకు చాలా ప్రమాదకరమన్నారు. ప్రజలపై పన్నుల భారాలు మోపడం, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం అభివృద్ధి అంటారా అని ప్రశ్నించారు. రెండుసార్లు సీఎంగా, కేంద్ర మంత్రులుగా పని చేసిన తమ కుటుంబ ఆస్తులను ప్రజల ముందు ఉంచడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, లక్ష్మీనారాయణ యా దవ్, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, మను, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసిన ఐటీడీపీ నాయకులు

సీమలో కొనసాగుతున్న బై బై జగన్ !

షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో .. ముఖ్యంగా చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి నియంతృత్వధోరణిని నిరసిస్తూ బయటకు వెళ్లిపోతున్న నేతల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైసీపీని వీడుతున్నవారంతా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన నంద్యాల జడ్పీటీసీ గోపవరం గోకుల్‌కృష్ణారెడ్డి వైసీపీకి సోమవారంనాడు రాజీనామా చేశారు. ఆయన హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా గోకుల్ కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసీపీకోసం ఎంతో కష్టపడ్డామని అన్నారు. అయినా తమకు గుర్తింపు లేదని వాపోయారు. పార్టీ కోసం చేసిన సేవలకు కనీసం మర్యాద కూడా ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తనపై విచక్షణారహితంగా ప్రవర్తించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని గోకుల్ కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడతానని చెప్పారు. పార్టీని అధికారంలోనికి తీసుకువస్తామని వెల్లడించారు. కాగా వైసీపీ మహిళా నేత దువ్వెల సృజన, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య కుమార్తె దారా పద్మజ సోమవారంనాడు ఏపీసీసీ చీఫ్ షర్మిల రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎస్వీ మోహన్‌రెడ్డి ఒక్కడే కావాలా..?

- మాతో పని లేకపోతే మేమెందుకు ఇక్కడ
- ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- మైక్, పేపర్లు నేలకేసి కొట్టి వెళ్లిపోయిన వైనం

కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గాల మధ్య విబేదాలు మరోసారి భగ్గుమన్నాయి. మీకు ఎస్వీ మోహన్ రెడ్డి ఒక్కడే కావాలా..? మమ్మల్ని ఎందుకు పిలవడం లేదు..? మాతో అవసరం లేకపోతే మేమెందుకు ఇక్కడ ఉండాలి..? అంటూ కర్నూలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎం ఇంతియాజ్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతో పని లేనప్పుడు ఇక్కడెందుకు ఉండాలి..?' అంటూ చేతిలో ఉన్న మైకు, పేపర్లు నేలకొసి కొట్టేసి ఆవేశంగా వెళ్లిపోయారు. సోమవారం జరిగిన ఈ ఘటన వైసీపీలో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఆఫీస్‌లోనే ఈ ఘటన జరిగిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయ మనోహరి దంపతులు, ఆయన వర్గానికి చెందిన కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలను వెంటబెట్టుకొని వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రచారం చేస్తున్నారు. ఇది ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు ఏమాత్రం రుచించడం లేదు. పైగా తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా హఫీజ్‌ఖాన్ ఆయన అనుచరుల వద్ద ఆవేదన వెలిబుచ్చినట్లు సమాచారం. మేము సిద్ధం పోస్టర్లు విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను ఉద్దేశపూర్వకంగానే ఇంతియాజ్ దూరం పెట్టారని ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ ఆఫీస్ సమీపంలో వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లతో ఇంతియాజ్ సమావేశం నిర్వహించారు. అభ్యర్థి ఇంతియాజ్ సహా గోషాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి పలువురు నాయకులు హాజరయ్యారు. గతంలో జరిగిన మేము సిద్ధం పోస్టర్లు విడుదల కార్యక్రమానికి తమను ఎందుకు పిలవలేదని ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గానికి చెందిన వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మల్లికార్జున (మల్లి) నిలదీశారు. తమ వద్ద ఫోన్ నంబర్లు లేకపోవడంతో పిలవలేదని ఆది మోహన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. మాటామాట పెరగడంతో ఎమ్మెల్యే హఫీజ్ ఆగ్రహంతో ఊగిపోయారు. అదే క్రమంలో 'ఎస్వీ మోహన్‌రెడ్డి ఒక్కడితో కలిసి ప్రచారం చేస్తున్నారు.. మాకు చెప్పడం లేదు.. ఇదేమా ఎమ్మెల్యేగా మాకు ఇస్తున్న గౌరవం అంటూ' ఆవేశంతో చేతిలో ఉన్న మైక్, పేపర్లు నేలకేసి కొట్టి అక్కడి నుంచి ఆవేశంగా హఫీజ్‌ఖాన్ వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం నగరంలో వైసీపీలో ఇదే ప్రధాన చర్చగా మారింది.

మహానందిలో నగర సంకీర్తన

మహానంది, మార్చి 25: మహానంది క్షేత్రంలో సోమవారం వివిధ స్వచ్ఛంద సంస్థ సేవా సంఘం సభ్యులు భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తనను నిర్వహించారు. తెల్లవారుజామున క్షేత్రంలో రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలను సభ్యులు ఆచరించారు. అనంతరం ఆలయం మాడవీధుల గుండా శివుడిపై సంకీర్తనలు పాడుతూ ప్రదక్షిణలు చేశారు. గత కొన్ని రోజుల నుంచి మహానందిలో సోమవారం ఉదయం నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు సభ్యులు భూమా గోపాల్, లక్కాకుల పెద్ద కాశయ్య, మునగ నూరి శ్రీలక్ష్మి తెలిపారు.

అరటి తోట ధ్వంసం



ధ్వంసం చేసిన అరటి తోటను చూపుతున్న రైతు నారాయణ

మహానంది, మార్చి 25 : మహానంది మండలం గాజులపల్లి సమీపంలో రైతు నారాయణ సాగు చేస్తున్న అరటి తోటను ఆదివారం అర్ధరాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. గ్రామం సమీపంలోని అంకిరెడ్డి చెరువు వద్ద తనకు ఉన్న 4 ఎకరాల్లో రైతు నారాయణ అరటి సాగు చేస్తున్నాడు. సమీపంలో నల్లమల అడవి ఉండడంతో రాత్రి వేళల్లో అడవి పందుల గుంపు అరటి తోటను ధ్వంసం చేశాయి. గత రెండు రోజుల నుంచి ఇలా తన తోటను అడవి పందులు దాడులు చేసి పంటను నాశనం చేస్తున్నాయని భాధిత రైతు అవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తనకు రూ. లక్ష వరకు పంట నష్టం జరిగినట్లు చెప్పారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

సంఘ మిత్ర విద్యార్థులకు నిత్యావసర కిట్ల పంపిణీ



విద్యార్థులకు నిత్యావసర కాస్మెటిక్ కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నంద్యాల (కల్చరల్), మార్చి 25: నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సంఘ మిత్ర ఆవాస గృహంలోని 56 మంది విద్యార్థులకు క్లబ్ సభ్యుడు శేగు నంద కిషోర్ సౌజన్యంతో నిత్యావసర కాస్మెటిక్ కిట్లు, పరీక్షల రాత కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కార్యవర్గ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు సోమేష్, నాగరాజు, మామిళ్ల నాగరాజు, డాక్టర్ గెలివి సహదేవుడు, ఆంజనేయులు గుప్తా, కుంచ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెదురు కలప స్వాధీనం



నిందితులను చూపుతున్న అటవీ అధికారులు

బండి ఆత్మకూరు, మార్చి 25: మండలంలోని నారపు రెడ్డి కుంట సమీపాన వెదురు కలపను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్‌వో నజీర్‌జా సోమవారం తెలిపారు. నంద్యాల డీఎఫ్‌వోకు రాబడిన సమాచారం మేరకు మొబైల్ పార్టీ డీఆర్‌వో నాగేంద్రనాయక్ స్థానిక ఎఫ్ఎస్‌వోలు వెంకటసుబ్బయ్య, తేజ, మరికొంత మంది సిబ్బంది కుంట సమీపాన అక్రమంగా వెదురు కలపను తరలిస్తున్న ఆటో, తొమ్మిది సైకిళ్లతోపాటు సుమారు వెయ్యి వెదుర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను వెదురు కలపను బండి ఆత్మకూరు అటవీ కార్యాలయానికి తరలించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోఆర్డీ మోహన్‌కుమార్

ఆత్మకూరు రూరల్, మార్చి 25: గ్రామాల్లో నెలకొన్న తాగు నీటి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టాలని ఈవోఆర్డీ మోహన్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే వేసవి కాలంలో గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వాటర్ స్కీంల నుంచి నీటిని అందించలేని పరిస్థితులు నెలకొన్న సందర్భంలో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వచ్చే ఏప్రిల్‌లో మరింత నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలు ఉన్నాయని, ఇందుకోసం గ్రామాల్లోని బావులు బోర్ల ద్వారా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మీనాకుమారి,లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

నీటి సమస్యపై చర్యలు తీసుకోవాలి

పాములపాడు, మార్చి 24: వేసవిలో భూగర్భజలాలు ఇంకిపోతున్నాయని, నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు ఎంపీడీవో సరస్వతి సూచించారు. గ్రామాలలోని ప్రజలు తాగునీటి సమస్యపై ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. సోమవారం ఎంపీడీవో కార్యలయంలో ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఏమైనా గ్రామాలలో నీటి సమస్య ఉందా, బోర్లు సరిగా పని చేస్తున్నాయా, తాగునీటి కొరత ఉందా లాంటి అంశాలపై అధికారులతో చర్చించారు. నీటి సమస్యలు ఎదురైతే తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, మార్చి 25: అనంతపురం జిల్లా కేంద్రంలోని రాణినగర్‌లో నివాసముంటున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన మేఘన (22) ఏడాది క్రితం అనంతపురానికి చెందిన కిషోర్‌ను కులాంతర ప్రేమ వివాహం చేసుకుంది. ప్రస్తుతం కిషోర్ ఓ సంస్థలో సేల్స్‌మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రాణినగర్‌లో వీరు నివాసముంటున్నారు. రెండు రోజుల కితం వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో సోమవారం తన ఇంట్లోనే మేఘన ఉరి వేసుకుంది. వెంటనే గుర్తించిన కిషోర్ ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. కొంతసేపటికే ఆమె మరణించింది. మేఘన మృతిపై వన్‌టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారు

- నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి
- టీడీపీలో చేరిన 15 వైసీపీ కుటుంబాలు



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య

కొత్తపల్లి, మార్చి 25: వైసీపీ అరాచక విధానాలతో ప్రజలు విసిగిపోయారనీ, ఓటు అనే ఆయుధంతో శాశ్వతంగా ఇంటికే పంపిస్తారని నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిత్త జయసూర్య అన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కొత్తపల్లి, పాములపాడు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, శంఖారావం కార్యక్రమాలు వంద శాతం చేసే విదంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మాండ్ర నాయకులకు సూచించారు. అలాగే చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. అనంతరం సింగరాజుపల్లిలో మండల కన్వీనర్ నారపురెడ్డి, నాయకులు జడ్ వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, వెంకటస్వామి రెడ్డి ఆధ్వర్యంలో 15 కుటుంబాలు వైసీపీని వీడి మాండ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి మాండ్ర పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఇదిలా ఉండగా.. శివపురం గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఆయన అనుచరులు కూడా మాండ్రను మర్యాదపూర్వకంగా కలిశారు. వారు కూడా టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. మాండ్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లోనూ కోతలు కోసి పేదలకు అన్యాయం చేసిందన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనాథరెడ్డి, లింగస్వామి గౌడు, శివారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, మోహన్, మాదుగుల లింగన్న, మాసుమయ్య, చంద్రమౌళీశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను సాగనంపండి

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి



కొర్రపోలూరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి

గడివేముల, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకొని భూ కబ్జాదారులను సాగనంపాలని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గౌరుచరిత అన్నారు. మండలంలోని కొర్రపోలూరు గ్రామంలో ఆమె సోమవారం ఇంటింటికి వెళ్లి టీడీపీ అమలు చేయబోయే సూపర్-6 పథకాలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయని అన్నారు. అలగనూరు రిజర్వాయర్ కరకట్ట కుంగితే మరమ్మతులు చేయని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అలగనూరు రిజర్వాయర్‌లో చేపలు పట్టుకొని జీవించే మత్సకారులు జీవనోపాధి కొల్పోయారని అన్నారు. రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే రైతులకు శాపంగా మారిందని అన్నారు. ఆన్‌లైన్‌లో 1బిలు రావడం లేదని అన్నారు. బ్యాంకులో లోన్‌లు రెన్యూవల్ చేసుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు అనుభవంలో ఉన్న భూములకు ఇనామ్ భూముల కింద నమోదవుతున్నాయని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే భూ సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టి మత్సకారులకు జీవనోపాధి కల్పిస్తామని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సీతారామిరెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ ఎస్‌ఏ రఫిక్, టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాసయాదవ్, జయన్న, శ్రీనివాసులు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 25 : గిరిజనుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం నంద్యాలలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గిరిజన సమైఖ్య సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఏపీ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరీ ఓంకార్ ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, జనసేన నంద్యాల సమన్వయకర్త విశ్వనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమాన్ని టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. వైసీపీ పాలనలో గిరిజనులతో సహా ఇతర సామాజిక వర్గాల అభ్యున్నతికి చేసిందేమీ లేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనులకు ప్రత్యేక నిధులను కేటాయించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా పంచాయతీ బోరు నీరు తరలింపు



గడివేముల, మార్చి 25: మండలంలోని పెసరవాయి గ్రామంలో ఓ వ్యక్తి అక్రమంగా పంచాయతీ బోరు నీటిని తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని సంగం కొట్టాల కాలనీ వాసులకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోరు వేశారు. ఈ బోరు నుంచి కాలనీ వాసులకు నీటి సరఫరా చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా ఈ బోరుకు పైపులు బిగించి ఆ వ్యక్తి పొలానికి నీరు పారించుకుంటుండడంతో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిలను వివరణ కోరేందుకు సంప్రదించగా వారు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన క్షేత్ర స్థాయి సిబ్బందిని బోరు వద్దకు పంపించి బోరుకు అక్రమంగా బిగించిన పైపులైన్ తొలగించారు. అక్రమంగా నీళ్లు తరలించిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

కమనీయం.. లక్ష్మీరంగనాయక స్వామి కల్యాణం



లక్ష్మీరంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గడివేముల, మార్చి 25: మండలంలోని వండుట్ల గ్రామ శివారులో ఉన్న లక్ష్మీరంగనాయకస్వామి ఆలయంలో సోమవారం స్వామివార్ల కల్యాణం కమణీయంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులకు సాంప్రదాయబద్ధంగా అర్చకులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్ష్మీరంగనాయకస్వామి తిరునాల సందర్భంగా భక్తులు రంగల్‌దర్వేసి ఖాద్రికి ఫాతెహాలు సమర్పించారు. అనంతరం రంగనాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రంగనాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి రంగల్‌దర్వేసి ఖాద్రికి ఫాతెహాలు సమర్పించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు ఉమామహేశ్వర ట్రస్టు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

జూపాడుబంగ్లా ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా, మార్చి 25: జూపాడుబంగ్లా మండలం ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మారుతీశంకర్‌కు సీఐగా పదోన్నతిపై వెళ్లడంతో కర్నూలు జిల్లా ఆదోని ఒకటో పట్టణ ఎస్‌ఐగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చేస్తానని చెప్పారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి రోజులు

పాణ్యం, మార్చి 25 : చంద్రబాబు పాలనతోనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని టీడీపీ గ్రామ యువజన నాయకులు సునీల్ అన్నారు. సోమవారం గ్రామంలోని మారెమ్మ దేవాలయం వద్ద చంద్రబాబు పర్యటన విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలు అభివృద్ధి బాట పడతారన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

మారుమూల ప్రాంతాల్లో ఉచిత విద్య

విద్యా భారతి సంస్థ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధి

నంద్యాల రూరల్ మార్చి 25 : విద్యాభారతి విద్యాలయాల ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలలో సైతం ఉచిత విద్యను అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలో ఉన్న సరస్వతీ విద్యాపీఠం పాఠశాలలో సమావేశం జరిగింది. సమావేశంలో విద్యాపీఠం అనంతపురం సమితి అధ్యక్షులు డా. జి.రామకృష్ణారెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ కార్యదర్శి కన్నా బాషా, డా. ఉదయ శంకర్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యాభారతి విద్యాలయాలలో చదివిన విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. తమ సంస్థ మారుమూల గిరిజన ప్రాంతాలలో సైతం విద్యాభివృద్ధితో పాటు గిరిజన మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలం, మార్చి 25: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

● అలరించిన నిత్యకళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు చెందిన సాయి అభినయ కూచిపూడి కళాక్షేత్రం బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద నర్తన గణపతి, మూషికవాహన, లింగాష్టకం, ఓం నమఃశివాయ, ఓం శ్రావణి, కాలభైరవాష్టకం తదితర గీతాలకు సంధ్యారాణి, అముక్తకృష్ణ, హర్షిణి, సహస్ర, లక్ష్మీప్రజ్ఞ, అర్చన, శ్రీవల్లి, కీర్తన తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



జగన్ పాలనతో ప్రశ్నార్థకంగా యువత భవిష్యత్

- విశాఖ పోర్టులో లభ్యమైన డ్రగ్స్‌పై సమగ్ర విచారణ జరగాలి
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఆత్మకూరు, మార్చి 25: సీఎం జగన్ పాలనతో రాష్ట్రంలో యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పిన జగన్.. డ్రగ్ క్యాపిటల్‌గా మార్చేసి యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడ గంజాయి లభ్యమైన వాటి మూలాలు ఏపీలోనే లభించడం బాధాకరమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలవడం కోసమే డ్రగ్ మాఫియాను రాష్ట్రంలోకి రప్పించిందా..? అని అనుమానం వ్యక్తం చేశారు. విశాఖ పోర్టులో తనిఖీలకు వచ్చిన కస్టమ్స్, సీబీఐ అధికారులను కంటైనర్ తెరవకుండా పోలీసులు ఎందుకు ప్రయత్నారని ప్రశ్నించారు. డ్రగ్స్ సీజ్ చేసిన సమయంలో స్థానిక పోలీసులు ప్రతిఘటించారని, అలాంటి వారి పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చాలని డిమాండ్ చేశారు. బ్రెజిల్ నుంచి రాష్ట్రానికి సీఎం జగన్‌కు తెలిసే మత్తు పదార్థాల అక్రమ రవాణా సాగుతోందని విమర్శించారు. చేపల మేత పేరుతో జరుగుతున్న డ్రగ్స్ దిగుమతి చేసుకున్న కంపెనీ యజమానులను బయటకు తీసుకురావాలని అన్నారు. ఇకపోతే ఒంటిమిట్ట మండలంలో చేనేత కార్మికుడు సుబ్బరావు మృతిపై సందేహాలు ఉన్నాయని ఆరోపించారు. వైసీపీ నేతల భూదాహం వల్లే సుబ్బరావు మృతిచెందారని అన్నారు. ఇది ముమ్మాటికి జగన్ సర్కార్ హత్యేనని తెలిపారు. సుబ్బరావు మృతికి గల కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

లోక కళ్యాణార్థం పౌర్ణమి హోమాలు



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), మార్చి 25: నంద్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మ స్ఫటికలింగేశ్వరాలయంలో సోమవారం అచల పరిపూర్ణ యోగానంద పాములేటి స్వామి ఆశీస్సులతో యోగనంద ఆధ్వర్యంలో అమ్మస్ఫటిక లింగేశ్వరునికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, మార్చి 25: గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న వారికి పెండింగ్‌లో వున్న ఐదు నెలల వేతనం ఇవ్వాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, సీఐటీయూ నాయకుడు రామ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, ట్రైబల్ అదనపు జిల్లా వైద్యశాఖాధికారి స్పందించి వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని అన్నారు. అలాగే గిరిజన గూడేల్లో సేవలందిస్తున్న హెల్త్ వర్కర్స్‌కు యూనిఫామ్, మెడికల్ కిట్లు, సెల్‌ఫోన్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకురాలు భారతి ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఆత్మకూరు, మార్చి 25: రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని సోమవారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ సమీపంలో గల డీపౌల్ హైస్కూల్‌లో శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని రెవెన్యూ అధికారులకు ఎన్నికల నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీశైలం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ సుధారాణి మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, గణాంకాల పరిశీలన బృందాలు, వీడియో పరిశీలన బృందాలు, ఎన్నికల నియమావళి పరిశీలన బృందాలతో పాటు రెవెన్యూ సిబ్బందికి వారివారి విధుల గురించి అవగాహన కల్పించేలా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణ ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసినట్లు చెప్పారు. ఈ శిక్షణకు ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల తహసీల్దార్ కే.బాబు, విజయరాణి, సుమతి, రామచంద్రుడులతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుకూరులో వైసీపీకి షాక్

-సర్పంచ్, ఉప సర్పంచ్ టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వెలుగోడు, మార్చి 25: మోతుకూరులో వైసీపీకి షాక్ తగిలింది. గ్రామానికి చెందిన సర్పంచ్ ముడిమెల చిన్నక్క, వైసీపీ నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు సుధాకరరెడ్డి, వైస్‌సర్పంచ్ పక్కీరమ్మ,నాలుగు, ఐదు వార్డు సభ్యులు వెంకటరమణ, లావణ్యతో పాటు మరో 50 కుటంబాలు టీడీపీలో చేరాయి. అలాగే బోయరేవుల గ్రామ బీసీ నాయకులు మాదన్న గౌడ్ ఆధ్వర్యంలో మరో 10 కుటుంబాలు వెలుగోడు టీడీపీ కార్యాలయలంలో బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో చేరాయి. అలాగే బండి ఆత్మకూరు మండలం నెమళ్ళ కుంటకు చెందిన 15 గిరిజన కుటుంబాలు చేరాయి. వీరికి బుడ్డా రాజశేఖరరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బన్నూరు రాంలింగారెడ్డి , టీడీపీ రాష్ట్ర నాయకులు తులసి రెడ్డి, శిరివెళ్ళ రజాక్, అన్నారూపు శేషిరెడ్డి, రామలింగారెడ్డి, రామానాయుడు, బోయ రేవుల సర్పంచ్ పెద్ద స్వామన్న, రమేష్ నాయుడు, భూపాల్ చౌదరి, ఖలీల్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మార్చి 25: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీ లు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 17 జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి 14 తులాల వెండి నాలుగో బహుమతి రూ.10,016, ఐదో బహుమతి రూ.6,116, ఆరోబహుమతి రూ.5,116 నగదును దాతలు, కమిటీ సభ్యులు అందజేశారు. రైతులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌ను కలిసిన కోట్ల రాఘవేంద్రరెడ్డి



ప్యాపిలిలో సుధాకర్‌రెడ్డిని కలిసిన కోట్ల రాఘవేంద్రరెడ్డి

ప్యాపిలి, మార్చి 25: డోన్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డిని టీడీపీ యువనాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి విజయానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, కోట్ల శ్రీనాథ్‌రెడ్డి, బత్తుల రమేష్‌రెడ్డి ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం

బనగానపల్లె, మార్చి 25: వైసీపీ ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు అన్యాయం చేసిందని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని జిల్లా అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పులిమద్ది నాగరాజు, బనగానపల్లె నియోజవకవర్గం కార్యదర్శి అనిల్‌కుమార్ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డికి సోమవారం స్థానిక కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. బీసీ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాసులు, కోదండరాముడు, సుధాకర్‌శెట్టి, సతీశ్, ధనుంజయ, ప్రసాద్‌శెట్టి, నారాయణరెడ్డి, వెంకటరమణ, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి

బేతంచెర్ల, మార్చి 25: టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ టీడీపీ అమలు చేసిన సూపర్ సిక్స్ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేస్తామని డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు టీడీపీ యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ అన్నారు. సోమవార సాయంత్రం నగర పంచాయతీలోని 1వ కౌన్సిల్ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన, స్థానిక టీడీపీ నాయకులు పాలెం భీమేష్ రెడ్డి, అంజాద్‌బాషా, సయ్యద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గన మాధవిరెడ్డి, ఎంఎస్, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి స్వామి, నాగరాజు, శ్రీకంటి మధు, సలీమా, మాబీ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ భూదాహంతోనే రైతు కుటుంబం ఆత్మహత్య

ప్యాపిలి, మార్చి 25: వైసీపీ భూదాహంతోనే కడప జిల్లా ఒంటిమిట్టలో రైతు సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్టలో ఉన్న రూ.లక్షల విలువ చేసే సుబ్బారావు భూమిని అధికారపార్టీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించారన్నారు. దీంతో మనస్తాపానికి గురైన రైతు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని నాగేశ్వరరావుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అరాచకాలు ఎంతో కాలం సాగవన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన ఆ పార్టీని ప్రజలు ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, మల్లి, మాదవరాజు, కోదండరామయ్య, ప్రణీత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే పార్టీకే మద్దతు

సంజామల, మార్చి 25: సమస్యలు పరిష్కరించే పార్టీకే తాము మద్దతు ఇస్తామని జిల్లా అఖిలభారత రజకసంఘం అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. సోమవారం తెలిపారు మండలంలోని ముదిగేడు పాలేరు వద్ద రజకులతో కలసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కులవృత్తిని నమ్ముకొని గ్రామాల్లో జీవిస్తున్న రజకుల పట్ల పాలకులు వివక్షత చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు బాబు, సభ్యులు గిరి, గురమూర్తి, చిన్నపుల్లయ్య, శివ, చిన్నరాముడు, పెద్దపుల్లన్న, శేఖర్, శివుడు పాల్గొన్నారు.

బడుగులను బలి తీసుకోవడమే సామాజిక న్యాయమా? : మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 25: సామాజిక న్యాయం అంటే బడుగు, బలహీన వర్గాలను బలి తీసుకోవడమేనా అని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సీఎం జగన్‌ను ప్రశ్నించారు. సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేదన్నారు. వారి ఆస్తులకు రక్షణ లేదన్న విషయం కడప జిల్లాకు చెందిన చేనేత కుటుంబం బలవన్మరణంతో మరోసారి రుజువైందని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు సీఎం జగన్ బాధ్యత వహించాలన్నారు. వైసీపీ నేతల భూకబ్జాలకు నిండు చేనేత కుటుంబం బలైందన్నారు వైసీపీ నాయకుల భూకబ్జాలతో రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన సాల సుబ్బారావుతో పాటు ఆయన భార్య పద్మావతి, చిన్న కుమార్తె వినయ ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. సీఎం సొంత జిల్లాలోనే పేదల భూములు లాగేసుకుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. వ్యవస్థలను వైసీపీ నాయకులు చేతుల్లోకి తీసుకొని రికార్డులను తారుమారు చేస్తున్నారన్నారు. వైసీపీ వేధింపులకు చేనేత కుటుంబం తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డారాన్నరు. బీసీ వర్గీయుల ఆస్తులు దిగ మింగి వారిని బలి తీసుకోవడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బడుగు, బలహీన వర్గాలు సీఎం జగన్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

నాటుసారా, మద్యం సరఫరాపై పోలీసుల దాడులు

బేతంచెర్ల, మార్చి 25: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బేతంచెర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో నాటుసారా తయారీ, సరఫరా, అక్రమ మద్యం అమ్మకాల నిర్మూలన నిమిత్తం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విస్తృత దాడులు చేశారు. ఈ దాడులలో 160 లీటర్ల నాటుసారా, 10 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం పరుచుకుని 150 లీటర్ల బెల్లం ఊటను, సారా బట్టీని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో సిబ్బంది చంద్రశేఖరప్ప, తిరుపాల్ నాయక్, బాల హుశేన్, గురుబాబు, రాజునాయక్, తిరుమలయ్య, శ్రీనివాసులు, సత్యమయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

మినీ రిజర్వాయర్‌ను పట్టించుకోని ఎమ్మెల్యే

- మౌలిక వసతులు కల్పించడంలో కాటసాని విఫలం
- మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 25: కోవెలకుంట్ల మండలంలోని జొలదరాసి వద్ద కుందూ నదిపై మినీ రిజర్వాయర్‌ను నిర్మించి తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి ఐదేళ్లయినా ఒక్క ఇటుక కూడా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్చలేకపోయారని బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని ముది గేడు రస్తాలో ఉన్న మైనార్టీ కాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మౌలిక వసతులు లేనిదే సామాజిక ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు సాధ్యపడవన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మౌలిక వసతులు కల్పించకుండా కల్లబొల్లి మాటలు చెప్పి నియోజకవర్గం ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కోవెలకుంట్ల పట్టణంలో గత ఐదేళ్లలో అత్యంత దారుణ స్థితికి చేరుకుందన్నారు. మురుగు కాల్వల్లో పూడికలు తీయడం కూడా మరిచారన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేశారని విమర్శించారు. కుందూ రిజర్వాయర్‌ను 16 నెలల్లో కట్టించి పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికి నాలుగేళ్లయినా ఒక్క ఇంచు పని కూడా ముందుకు సాగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వర రెడ్డి, పొట్టిపాడు సుబ్బారెడ్డి, కాశిరెడ్డి మల్లికార్జునరెడ్డి, బీవీ ప్రసాద్‌రెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, బిజనవేముల హుసేనయ్య, పెనుగొండ రాజశేఖర్, గడ్డం అమర్‌నాథరెడ్డి, కుళాయి, మురళి, జనసేననాయకులు నాగప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 కుటుంబాలు టీడీపీలో చేరిక: కోవెలకుంట్ల పట్టణంలో వైసీపీకి మరో షాక్ తగిలింది. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన మునెమ్మ, జగన్‌ల ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీలో చేరిన మునెమ్మ, జగన్‌లు మాట్లాడుతూ వైసీపీ అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు విసిగి వేసారి టీడీపీలో చేరినట్లు తెలిపారు.



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

వైసీపీ పాలన రైతుల పాలిట శాపం

- రానున్నది రైతు రాజ్యం
- కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, మార్చి 25: వైసీపీ ప్రభుత్వ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అని డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండంలోని వెంకటగిరి, మర్రికుంట, పెండేకల్, రేపల్లె గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సైకో జగన్ రెడ్డి పాలన రాష్ట్ర రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకునే దౌర్భాగ్యం దాపురించిందన్నారు. రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులు వలస కూలీలుగా మారి ఇతర రాష్ట్రాలకు వెళ్లి జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన వెంటనే రాష్ట్రంలో రైతు రాజ్యం తీసుకువస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్రాన్ని అప్పులమయం చేసి, డోన్ నియోజకవర్గంలో కమిషన్ల కోసం కక్కుర్తి పడి గత పాలకులు వేసిన రోడ్లపైనే రోడ్లు వేసి కమిషన్లు దండుకోవడం మంత్రి బుగ్గన నైజమని కోట్ల తీవ్రంగా ధ్వజమెత్తారు. బేతంచెర్ల మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించి మిగిలిన మండలాలపై ప్రభుత్వం సవతి ప్రేమ చూపించడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద వెంకటేశ్వర్లు, రాజగోపాల్‌రెడ్డి, గొల్ల సుబ్బయ్య, ఈరన్న, తిరుమలేష్ రెడ్డి, డోని రామాంజనేయులు, అయ్యస్వామి, సత్యం, సుబ్బారెడద్ది, ఎల్లస్వామి, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, నగేష్, రామతిమ్మయ్య, మౌలాలి, బాలరంగడు, శివ నారాయణ, బజారు, పెద్దమాధవస్వామి పాల్గొన్నారు.



ప్రజలకు విజయకేతనం చూపుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

వైసీపీ నీతులు చెప్పడమా.. సిగ్గు చేటు

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 25: డోన్ నియోజకవర్గంలో ఐదేళ్ల పాటు ఇసుక, లిక్కర్, మట్కా, భూ మాఫియాలను పెంచి పోషించిన వైసీపీ నాయకులు నీతులు చెప్పడం సిగ్గు చేటని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విచ్చలవిడిగా కల్తీ మద్యంను అమ్మి ఎంతో మంది మహిళల తాలిబొట్లను తెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే 50 ఏళ్లకే బీసీలకు నెలకు రూ.4వేలు పింఛన్ అమలులోకి వస్తాయని అన్నారు. సీఎం జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి జగన్ చివరకు మోసం చేశారిన మండిపడ్డారు. మహిళలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చేందుకే చంద్రబాబు మహాశక్తి పథకాన్ని ప్రకటించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ నాయుడు, రంజిత్ కిరణ్, వలసల సుధాకర్, చిన్నమల్కాపురం రామాంజుల నాయుడు, సుధాకర్ రెడ్డి, మద్దయ్య నాయుడు, కేశాలు, రషీద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మార్చి 25: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా ఏర్పాటు చేసిన రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 17 జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన వృషభరాజములకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి 14 తులాల వెండి నాలుగో బహుమతి రూ.10,016, ఐదో బహుమతి రూ.6,116, ఆరోబహుమతి రూ.5,116 నగదును దాతలు, కమిటీ సభ్యులు అందజేశారు. రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాలు

డోన్(రూరల్), మార్చి 25: మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆశ్రమ సమీపంలో బండలాగుడు పోటీలను నిర్వహించి గెలుపొందిన వృషభాల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

బేతంచెర్ల, మార్చి 25: ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ సూచించారు. మండలంలోని ఎంబాయి, రుద్రవరం, మండ్లవానిపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సంజామల, మార్చి 25: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో నాగకుమార్ అధికారులను ఆదేశించారు. కోరారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్‌డీ పాపారాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉపేందర్‌రెడ్డితో కలసి తాగునీటి సమస్యపై సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనిచేయని బోర్లకు మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంటు రషీద్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రఘురామ్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌కృష్ణతో కలిసి సమావేశమయ్యారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లపై చర్యలు: ఎంపీడీవో

కొలిమిగుండ్ల, మార్చి 25: కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందిన రాజు, బెలుం గ్రామానికి చెందిన రవి, హరిప్రసాద్ అనే ముగ్గురు వలంటీర్లపై ఎన్నికల నియమావళి అతిక్రమించినందుకు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో సాయికృష్ణ సోమవారం తెలిపారు. వారిని విధుల నుంచి తొలగించినట్లు ఆయన తెలిపారు.

బైండోవర్ కేసులు నమోదు

అవుకు, మార్చి 25: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ బాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సనిగొండ్ల, వేములపాడు, లింగంబోడు, రామాపురం, గుండ్లశింగవరం, గ్రామాలకు చెందిన 13 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దారు ఎదుట హాజరు పరిచి బెయిల్‌పై విడుదల చేసినట్లు తెలిపారు.

బనగానపల్లె: మండలంలోని యనకండ్ల గ్రామంలో ఇరువర్గాలకు చెందిన 20 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు.

మత్స్యకారుల వలలకు నిప్పు

ఉయ్యాలవాడ, మార్చి 25: మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు వద్ద ఉయ్యాలవాడ మత్స్యకారుల సంఘం వారు చేపల కోసం ఏర్పాటు చేసిన వలలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఆదివారం రాత్రి చెరువు అలుగు వద్దకు పెద్ద ఎత్తున మంటలు చెరలేగటంతో వాటిని ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపుకాలేదు. దీంతో వలలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వీటి విలువ దాదాపుగా రూ. 2 లక్షల వరకు ఉంటుందని మత్స్యకారులు తెలిపారు.

హనుమంత వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి

నంద్యాల మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం పుట్లాలమ్మ క్షేత్రం లో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం లక్ష్మీనరసింహస్వామికి దీక్షాహోమం నిర్వహించారు. రాత్రి హనుమంతవాహనంపై స్వామిని భక్తులకు దర్శనం కల్పించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పల్లకి సేవ

కోవెలకుంట్ల, మార్చి 25: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర రెడ్డి, గురుస్వామి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా హోలీ

ప్యాపిలి, మార్చి 25: మండలంలోని అలేబాదుతండా, సీతమ్మతండా, లక్ష్మీతండాల్లో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు.

డోన్(రూరల్): పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో హోలి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చిన్నారులు, యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు వేశారు. యువకులు బైకులపై తిరుగుతూ రంగులు చల్లుకున్నారు.

అవుకు: మండలంలోని గిరిజనులు హోలీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అవుకు పట్టణంతో పాటు ఇస్రానాయక్ తాండ, మన్నె నాయక్ తాండ కొండనాయిని పల్లె, సిక్కెల పల్లె తాండ మారె మగుల తాండలోని సేవాలాల్ ఆలయంలో పూజలు చేశారు. గిరిజనులు సాంప్రదాయబద్ధంగా నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకున్నారు.

ఆళ్లగడ్డ: ఆనందోత్సాహాల మధ్య హోలి పండుగను ప్రజలు సోమవారం జరుపుకున్నారు. పెద్దలు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

చాగలమర్రి: మండలంలోని కేపీ తాండ, ఎం.తాండ, ఓజీ తాండ తదితర గ్రామాల్లో హోలి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు, మహిళలు రంగులు చల్లుకొని రంగోలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుగాలి మహిళలు చేపట్టిన వివిధ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



ప్యాపిలి మండలం అలేబాదు తండాలో రంగులు చల్లుకుంటున్న గిరిజనులు



చాగలమర్రి మండలం ఎం. తండాలో

వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదు

చాగలమర్రి, మార్చి 25: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. సోమవారం 1వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి వివరించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాజా రసూల్, అజీమ్, కరిముల్లా, నూర్‌బాష, ముల్లా అబ్దుల్లా, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

యాగంటిలో పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 25: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భక్తులు, పూజారులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీ ఉంచి ఊరేగించారు.

నాటు సారా స్వాధీనం

బనగానపల్లె, మార్చి 25: బనగానపల్లె నియోజకవర్గంలో దాడులు నిర్వహించి 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జోగేంద్ర సోమవారం తెలిపారు. డీటీఎఫ్ సీఐ విజయకుమార్, సెబ్ సిబ్బందితో కలసి కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయునిపేట వద్ద తనిఖీలు చేపట్టగా అదే గ్రామానికి చెందిన గాజుల హుసేన్‌బాషా లనే వ్యక్తి నుంచి 30 లీటర్ల సాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే కోవెలకుంట్ల మండలం పాతపాడు గ్రామం వద్ద తనిఖీ చేయగా పెద్ద దస్తగిరి వద్ద 30 లీటర్లు నాటు సారా, అలాగే పిక్కిళ్లపల్లె తాండా వద్ద 30 లీటర్లు నాటుసారా సీజ్ చేసి పారి పోయిన మంగు నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సారా విక్రేతల అరెస్టు

అవుకు, మార్చి 25: మండలంలోని ముగ్గురు నాటుసారా విక్రేతలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కిరణ్ బాబు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాపురం గ్రామానికి చెందిన నాగమ్మ, సంగపట్నం గ్రామానికి చెందిన మద్దమ్మ, కొండనాయినిపల్లె గ్రామానికి చెందిన బోయ అశోక్ అనే నాటుసారా విక్రేతలపై నెల రోజుల క్రితం దాడి చేశామన్నారు. ఆ సమయంలో నాటు సారాను వదిలేసి పారిపోయారన్నారు. వీరిపై నిఘా ఉంచి ఉదయం అరెస్ట్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఉమ్మడి ప్రణాళికపై చర్చ

ఆళ్లగడ్డ, మార్చి 25: రానున్న ఎన్నికల్లో జనసేన టీడీపీ ప్రణాళిక రూపొందిస్తామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని జనసేన నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఆయన సోదరులను సోమవారం వారి స్వగృహంలో కలిశారు. ఎన్నికల్లో ఉమ్మడి ప్రచారంపై పార్టీ అధిష్టానం పెద్దలతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇరిగెల సోదరులు సూర్యనారాయణ రెడ్డి, రామచంద్రారెడ్డి, జున్ను ప్రసాదరెడ్డి ఉన్నారు.

కోడ్ ఉల్లంఘన

ఆళ్లగడ్డ, మార్చి 25: సార్వత్రిక ఎన్నికలకు కోడ్ వచ్చి వారం రోజులు అవుతున్నా వైసీపీ రంగులు తొలగలేదు. ప్రధానంగా ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న 1వ సచివాలయ భవనానికి ఉన్న వైసీపీ రంగులను మున్సిపాలిటీ అధికారులు తొలగించలేదు.

భక్తిశ్రద్ధలతో గంధం మహోత్సవం

చాగలమర్రి, మార్చి 25: మండలంలోని కృష్ణంపల్లెలో జమాల్‌వలి గంధం మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్గాలో ఫాతెహాలు చేశారు.

వైసీపీకి చివరి ఎన్నికలు

శిరివెళ్ల, మార్చి 25 : రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు వైసీపీకి చివరి ఎన్నికలని టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకుడు భార్గవ్‌రామ్ నాయుడు అన్నారు. మండలంలోని వనికెందిన్నె గ్రామానికి చెందిన చిటికెల బాలకాశి, పెద్ద పక్కిరయ్య, నడిపి పక్కిరయ్య, రాయుడు, దస్తగిరి, హుసేని, గుండి చంద్ర, చిన్నయ్య, శేఖర్, మేడి పెద్ద పక్కిరయ్య, మేడి దస్తగిరి, కుందరపు నాగరాజు, శ్రీను తదితరులు 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, వనికెందిన్నె గ్రామ మాజీ సర్పంచ్ రాముడు, సీనియర్ నాయకుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలోని భూమా నివాసంలో భార్గవ్‌రామ్ నాయుడు వారికి కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

బేతంచెర్ల, మార్చి 25: లోక కళ్యాణార్థం పట్టణంలోని అమ్మవారిశాలలో ఫాల్గుణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పవన్‌కుమార శర్మ వేదమంత్రోచ్ఛరణాల భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు కందగడ్డల మోహన్‌రావు, కందగడ్డల జనార్దన్, కొప్పరపు శేష మోహన్, బచ్చు సుబ్రహ్మణ్యం, మద్దిలేటి స్వామి, రాజేంద్ర కుమార్, లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 25 : మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొలువుదీరిన గురప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మాజీమంత్రి భూమా అఖిలప్రియ గురప్పస్వామి సన్నిధిలో పూజలు చేశారు. కార్యక్రమంలో బండారు బాలరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అఖిలప్రియ గెలవాలని ఫాతెహాలు

చాగలమర్రి, మార్చి 25: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరి స్వామి దర్గా వద్ద సోమవారం టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు చేశారు. ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని, అఖిలప్రియ అత్యధిక మెజార్టీతో గెలవాలని దస్తగిరిస్వామికి ఫాతెహాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అబ్దుల్‌ఖాదర్, కేఆర్‌కే రవి తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు అంతం తప్పదు: మాజీ మంత్రి



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

రుద్రవరం, మార్చి 25 : రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసీపీకి అంతం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం సాయంత్రం ఆలమూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల చూపు టీడీపీ వైపు మళ్లిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

● మండలంలోని ఆలమూరు గ్రామంలో వైసీపీని వీడి టీడీపీలో 25 కుటుంబాలు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో చేరారు. నీలి సంజీవ, సతీష్, రమణయ్య, మరో 22 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో భార్గవరామనాయుడు, చింతకుంట శ్రీనివాసరెడ్డి, ఆలమూరు నారాయణ, పోలా గురుమూర్తి, పార్థసారధిరెడ్డి, మాజీ ఎంపీటీసీ బలరామిరెడ్డి పాల్గొన్నారు.